


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


టీడీపీ నేత రెడ్డి అనంతకుమారి

జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావుకు సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళాకు కోనసీమ జిల్లా నుంచి అత్యధికంగా బస్సులను నడిపించిన జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావును గురువారం ఘనంగా సత్కరించారు. అత్యధికంగా జిల్లా నుంచి 26 బస్సులను నడిపించడంలో కీలక పాత్ర పోషించి సహాయ సహకారాలు అందించిన శ్రీనివాసరావును డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి, డిపో సిబ్బంది సత్కరించారు. కుంభమేళా యాత్రకు స్పెషల్ బస్సులను నడిపేందుకు కృషి చేసిన ఓపీఆర్ఎస్ కౌంటర్ సిబ్బందిని, గ్యారేజీ ఇన్‌చార్జి జీఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, బుకింగ్ సూపర్‌వైజర్ నాగరాజు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎన్.వరహాలబాబులకు బహుమతులు అందజేసి అభినందించారు.

నేటి నుంచి పెద్దింట్లమ్మవారి ఉత్సవాలు



అంతర్వేది, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంమెండిపాలెం చినకొల్లేరులో వెలసియున్న శ్రీపెద్దింట్లమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి మార్చి 28వ తేదీ వరకు జరుగుతాయని అంతర్వేది దేవస్థానం సహాయ కమిషనరు వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. తొలిసారిగా తమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మార్చి 8వ తేదీ ఉదయం 8.05 గంటలకు అమ్మవారి ప్రభ ఊరేగింపు ప్రారంభమవుతుందని, అదే రోజు రాత్రి 10.30 గంటలకు గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మ కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లు చేశామని సత్యనారాయణ చెప్పారు.


ఓటు వేస్తున్న ఎంపీ హరీష్


ఎమ్మెల్యే బండారు


ఓటు వేసిన మంత్రి సుభాష్


ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్


ఎమ్మెల్యే వేగుళ్ల


ఎమ్మెల్యే అయితాబత్తుల


అమలాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి


అంబాజీపేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు


ఐ.పోలవరంలో ఓటేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం


మలికిపురం: ఓటేసిన కండక్టర్

గ్రాడ్యుయే ఓట్లు!


కపిలేశ్వరపురం హైస్కూల్‌లో ఓటేస్తున్న దిడ్ల రాఘవులు

కోనసీమలో 73.09 శాతం

పోలింగ్ కేంద్రాల వద్ద ఎమ్మెల్యేల పర్యవేక్షణ
రాజశేఖర్, రాఘవుల మధ్యే పోటీ


పి.గన్నవరంలో చిన్నారితో ఇలా..


రాయవరంలో కొత్త జంట ఓటు

(ఏలూరు/అమలాపురం- ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి వివాదాలకు తావులేకుండా జరిగింది. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. పట్టభద్ర ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారనే ఊహలకు భిన్నంగా పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు నెమ్మదిగా కొనసాగింది. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 5.77 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఆరంభంలోనే అనేక పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక వెలవెలబోయాయి. ఉదయం 11 గంటల తర్వాత క్రమేపీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రావడం ఆరంభమైంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అడపాదడపా కనిపించారు. వాస్తవానికి ప్రచారంలో కనిపించినంత వేగం పోలింగ్ కేంద్రాలకు వచ్చేసరికి చప్పబడిపోయింది. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో ఓటర్లు తమంతట తాముగానే తొలి రెండు గంటల్లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు భావించారు. కానీ దీనికి భిన్నంగా ఆసాంతం ఓటర్లలో అలాంటి ఉత్సాహం ఏదీ కనిపించలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇదే మాదిరి వాతావరణం కనిపించిందనే సమాచారం. పోలింగ్ శాతం అతి తక్కువగా ఉండడంతో టీడీపీ వర్గాలు మధ్యాహ్నం నాటికే అప్రమత్తమయ్యారు. తొలి నాలుగు గంటల్లో మొత్తం కేవలం 20 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఈ పరిణామాన్ని గమనించి ఎక్కడికక్కడ నియోజకవర్గ స్థాయిలో కేడర్‌ను అప్రమత్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. స్వేచ్ఛగా ఓటు వేయడంటూ పట్టభద్రులకు మరోసారి విజ్ఞప్తిచేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఎమ్మెల్యేలంతా తమ వంతు పాత్ర పోషించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
1. ఏలూరు	66	42,282	29,651	70.13
2. పశ్చిమగోదావరి	93	70,052	48,893	69.80
3. తూర్పుగోదావరి	92	62,970	42,446	67.41
4. కాకినాడ	98	70,540	47,150	66.84
5. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	95	64,471	47,125	73.09
6. అల్లూరి సీతారామరాజు	12	4,669	3,637	77.90
మొత్తం	456	314984	2,18,902	69.50

రండి బాబు.. రండి

అతి తక్కువ ఓటర్లు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తం పోలింగ్ శాతంలో ముందు వరుసలో నిలిచింది. ఇదే జిల్లాలో కేవలం 4 వేల 669 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3 వేల 637 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.90 శాతం మేర నమోదైంది. ఈ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సంఖ్య కూడా అత్యల్పమే. వాస్తవానికి గోదావరి జిల్లాల్లో ఏ ఎన్నికలు వచ్చినా హడావుడే కనిపిస్తుంది. ప్రత్యేకించి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కాబట్టి వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ దిశగా టీడీపీ కేడర్ ప్రచారంలో హోరెత్తించారు. అయినప్పటికీ పోలింగ్ దగ్గరకొచ్చేసరికి ఓటర్లలో ఆసక్తి కనిపించలేదు.

పోలింగ్ ఆసాంతం పోటా పోటీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ఒకవైపు మందకొడిగా సాగినా.. ఇంకోవైపు తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు మధ్య పోటీ హోరాహోరీగానే సాగినట్టే కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగుదేశం, పీడీఎఫ్ అనుకూలురు ఎక్కడికక్కడ గుమిగూడి ప్రచారం చేసి వచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ పక్షాన ఓటర్లకు ఎరవేసేందుకు ప్రయత్నించారంటూ పీడీఎఫ్ అభ్యర్థి మద్దతుదారులు ఆరోపణలు చేశారు.


అమలాపురంలో పోలీసు బందోబస్తు

ప్రశాంతంగా
కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్

అమలాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, మూడు పట్టణాల్లో ఏర్పాటుచేసిన 95 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు 73.09 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి ఊపందుకుంది. జిల్లాస్థాయిలో 73శాతం పైనే పోలింగ్ జరగడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎవరి అంచనాలతో వారు తమకే మొగ్గు ఎక్కువగా ఉంటుందంటూ అంచనాలు వేసుకుంటున్నారు. కోనసీమ జిల్లా పరిధిలో 64,471 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 47,125 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 27,450 మంది, మహిళలు 19,850 మంది, ఇతరులు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. ముమ్మిడివరం మండలంలోని పోలింగ్ బూత్ నంబరు 192లో 666 ఓట్లు పూర్తిస్థాయిలో పోలై నూరుశాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా అమలాపురంలోని 218వ పోలింగ్ బూత్‌లో 476 ఓట్లు పోలై 65.47 శాతం నమోదైంది. పోలింగ్ సరళిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీవో కె.మాధవితో పాటు పోలీసు శాఖకు చెందిన అధికారులు బూత్‌ల వారీగా పరిశీలించారు. ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని ప్రైవేటు స్కూళ్లు తెరవడం వల్ల ఉపాధ్యాయులు షిఫ్టుల వారీగా వచ్చి ఆయ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం కనిపించింది. ఎస్కేబీఆర్ కళాశాలలో ఏకంగా ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అధికారులు, పోలీసులు అక్కడే మోహరించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూలులోని 191వ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆరు జిల్లాల పరిధిలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని సమీక్షించేందుకు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ రామచంద్రపురంలోను, ఉప్పలగుప్తంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, వైసీపీ ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు హైస్కూలులోను, మరో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అల్లవరంలో, మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు దంపతులు ఎస్కేబీఆర్ కళాశాలలోను ఓటు హక్కు వినియోగించుకున్నారు. అమలాపురంలో ఎస్కేబీఆర్ కళాశాలలో గల 217 పోలింగ్ బూత్‌లో పోలింగ్ ఏజెంట్‌కు, ఓటరుకు మధ్య జరిగిన వాగ్వివాదం స్వల్ప వివాదానికి దారితీసింది. పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న మోర్త సూర్య అనే వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి యూటీఎఫ్ డైరీని తీసుకువచ్చి ఓటు వేసేందుకు వెళుతున్న ఓటర్లకు చూపించడాన్ని ఓటరైన ఎంఎస్ఎన్ మూర్తి ప్రశ్నించి పీవో ఎదుట అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం తలెత్తింది. దాంతో పోలీసులు ప్రవేశించి అతడిని బయటికి పంపించారు.



- పయ్యావుల పద్దుపై ఆశలు
- కలగా ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ
- పనులు చేస్తామని బాబు, పవన్ హామీ
- సాగని ఏలేరు-తాండవ ప్రాజెక్టు
- రూ.వెయ్యి కోట్లకు డెల్టా ప్రతిపాదనలు
- కోటిపల్లి రైల్వేలైన్ పూర్తయ్యేనా
- కాకినాడ స్మార్ట్ సిటీ మాటేంటో..
- సూపర్ సిక్స్ హామీలకు ఎదురుచూపులు
- ఉమ్మడి తూర్పునకు వరాల జల్లు కురిసేనా

నేడే కూటమి బడ్జెట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి బడ్జెట్ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఎదురుచూస్తోంది. నేడు రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టనున్న పద్దు జిల్లాకు నిధుల వరద కురిపిస్తుందని నిరీక్షిస్తోంది. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేక జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో జరిగిన నష్టానికి నిధుల విడుదలతో చికిత్స చేస్తారని ఆశిస్తోంది. వర్షాలు, వరదలు వస్తే ముంపులో చిక్కుకుపోయి ఏటా ఉమ్మడి జిల్లాలో అనేక నియోజకవర్గాలు విలవిల్లాడిపోతున్నాయి. ఏళ్లకు ఏళ్లు ముందుకు కదలకుండా కలగానే మిగులుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ నుంచి అటకెక్కిన డెల్టా ఆధునికీకరణ, ఆచరణకు నోచుకోని ఏలేరు-తాండవ కాలువ లింకింగ్, పూర్తికాని పోలవరం ఎడమ ప్రధాన కాలువ వరకు ఎన్నో సమస్యలు కూటమి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులతో తిరిగి పునరుజ్జీవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికలకు ముందు, ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటికి నిధులిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇవ్వడంతో ఈ మేరకు కేటాయింపులుంటాయని అంతా ఆశిస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్.. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతులకు నిధుల కేటాయింపులు ఏ మేర ఉంటాయనేది చర్చ నీయాంశంగా మారింది.

ఏలేరుకు మోక్షం లభించేనా..

కాకినాడ జిల్లాలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించేసింది. అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేసేసింది. ఇక అప్పటి నుంచి ఏలేరు ఆధునికీకరణ పక్కకు పోయింది. దీంతో వర్షాలు, వరద వచ్చిన ప్రతిసారీ ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. గతేడాది వరదలకు ఐదు వేల ఎకరాలు నీటమునిగాయి. అప్పట్లో సీఎం జగన్ గొల్లప్రోలు పర్యటనకు వచ్చినప్పుడు ఏలేరు ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. పాత అంచనాలను సవరించి కొత్తగా సిద్ధంచేసిన రూ.663 కోట్ల అంచనాలకు మోక్షం కలగలేదు. అనేక బడ్జెట్‌లు వెళ్లిపోయినా ఆధునికీకరణకు డబ్బులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలుసార్లు ప్రస్తావించారు. దీంతో ఈ బడ్జెట్‌లో ఈ పనులకు నిధులు ఏమేరకు కేటాయిస్తారనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా సవరించిన అంచనాలు రూ.794 కోట్లకు చేరాయి.

డెల్టా..ఆధునికీకరణ సంగతేంటో..

కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన డెల్టా ఆధునికీకరణ సైతం మూలనపడిపోయింది. గడచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు వరదలతో కోనసీమ అతలాకుతలమైంది. ఏటిగట్ల పటిష్టత చేపట్టలేదు.ఇప్పుడు డెల్టా ఆధునికీకరణకు రూ.వెయ్యి కోట్లపైనే ఖర్చు కానుంది. సెంట్రల్ డెల్టాకు కీలకమైన లొల్ల లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బడ్జెట్‌లో వీటికి కేటాయింపులు తక్షణవసరంగా మారింది. రూ.470కోట్లతో ఏలేరు-తాండవ లింకు కాలువ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినా పనులు టెండర్ల దశలోనే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 214 కిలో మీటర్లు ఉన్న ఈ కాలువ ద్వారా కాకినాడ జిల్లాలో 1.67 లక్షల ఎకరాలు, కోనసీమ జిల్లాలో 2,326 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 81 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.3,645 కోట్ల పనులకు 72.7 శాతం పనులు పూర్తికాగా వైసీపీ హయాంలో ఎక్కడికక్కడ మిగిలిన పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచి పూర్తి చేయాల్సి ఉంది.

తల్లికి వందనం.. ఆర్‌టీసీ ప్రయాణం..

తల్లికి వందనం మే నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధులు అవసరం. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మందికి మేలు కలగనుంది. దీంతో మహిళల్లోనూ బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది.

స్మార్ట్‌సిటీకి నిధులిస్తారా...

కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులు ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం కూడా తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ వైసీపీ హయాంలో నిధులు విడుదల చేయలేదు. అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

కోటిపల్లి కూత పెట్టేనా..

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను జగన్ సర్కారులో కలగా మారింది. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ ఈ లైను పూర్తి చేస్తామని కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రాష్ట్ర వాటా నిధుల కింద కేటాయింపులు జరగాల్సి ఉంది. దీంతో ఎన్ని నిధులు కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి 2001లో భట్నవిల్లి వద్ద శంకుస్థాపన చేసిన ఈ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

సబ్బుపై సీవీ రామన్ చిత్రం

» సోప్ కార్వింగ్ ద్వారా చిత్రించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు




సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బుపై చెక్కిన సర్ సీవీ రామన్ చిత్రం, చిత్రించిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు సబ్బు బిళ్లపై ఆయన చిత్రాన్ని చిత్రించారు. సోప్ కార్వింగ్ కళ ద్వారా సబ్బు బిళ్లను చెక్కి చిత్రించిన రామన్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. సర్ సీవీ రామన్ జీవితచరిత్ర గురించివిద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సబ్బుబిళ్లపై ఆయన చిత్రాన్ని చెక్కినట్లు గోవిందరాజులు తెలిపారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం

» సామర్లకోటలో రథంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు




రథోత్సవంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల.. స్వామి,అమ్మవార్లు



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి,బాలాత్రిపురసుందరి అమ్మవార్ల రథోత్సవం గురువారం ఘనంగాజరిగింది. స్వామి,అమ్మవార్లు ఆశీనులు కాగా సర్వాంగ సుందరంగా అలంకరించిన రథం ముందుకు కదిలింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పల్లకిపై గాంధీ బొమ్మసెంటర్‌కు మంగళ వాయిద్యాల మధ్య భక్తులు తీసుకురాగా అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్నబాబు, వినయ్‌రథంవేదికపై అలంక రించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నంకుంభంపై పగులకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్యే రాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, ఆలయ ఈవో బళ్ల నీలకంఠం, తలాటం సూర్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన రథోత్సవంలో వివిధ సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రదర్శనకారులు తమ కళలను ప్రదర్శించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఇంటి ఆవరణలో 5వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు.



ఊరేగింపులో ప్రదర్శనగా విచిత్ర వేషధారణలు

బహుముఖ ప్రజ్ఞాశాలి..

కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా

» సంఘ సంస్కర్తగా, కవిగా విశిష్టస్థానం
» ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర
» జాతీయ శాసన సభలో సభ్యుడు
» నేడు ఆయన 140వ జయంతి



(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

ఉన్నత పాఠశాలతోనే విద్యాభ్యాసం ముగిసినా 50కిపైగా పుస్తకాలు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా. సంఘ సంస్కర్తగా, కవిగా గుర్తింపు పొందిన ఈయన గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలోను కీలకపాత్ర పోషించారు. జాతీయ శాసనసభలో మరణించేవరకూ సభ్యుడిగాఉన్నారు.తన రచనలుప్రసంగాల ద్వారా స్వాతంత్ర్య సమరశంఖాన్ని పూరించారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్మాతిక పీఠం ఆరో పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 1885, ఫిబ్రవరి 28న కాకినాడ జిల్లా పిఠాపురంలో మొహిద్దీన్‌బాద్‌షా, చాంద్‌బీబీ దంపతులకు జన్మించారు. తండ్రి వెంట ఉంటూ అరబ్బీ, పర్షియన్, ఉర్దూభాషలు నేర్చుకున్న ఈయన ఉన్నత పాఠశాలతోనే చదువులు ముగించారు. ఉమర్‌ఆలీషా 14వ ఏటనే చందోబద్ధంగా పద్యాలు రాయడంతోపాటు ధారాళంగా కవిత్వాలు చెబుతూ తన వంశ గురువైన అఖైలలీషాను స్తుతిస్తూ బ్రహ్మ విద్యావిలాసం అనే శతకాన్ని రచించారు. 18వఏట గద్య, పద్యాత్మకమైన మణిమాల నాటకాన్ని రాశారు. ఆయన 50కిపైగా గ్రంథాలు, పుస్తకాలను రచించారు. సామాజిక ఆధ్యాత్మిక ప్రయోజనమే లక్ష్యంగా, జాతీయభావం, సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, సర్వమత సమభావనలతోపాటు సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, మహిళాభ్యుదయం, ప్రజాచైతన్యాన్ని ఆశిస్తూ రచనలు సాగించారు. పండిత సమ్మేళనాల్లో శతావధానాలు చేశారు.

స్వాతంత్ర సమరయోధునిగా..

జాతీయ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటాలు, ఉద్యమాల్లో ఉమర్‌ఆలీషా పాల్గొన్నారు. మహాత్మా గాంధీతో విజయవాడలో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. 1924లో అఖిలభారత ఖిలావత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ముస్లిం లీగ్ మద్రాసు శాఖ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. గాంధీ టోపీలతో సాగిన ఖిలావత్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 1934 డిసెంబరులో ఉత్తర మద్రాసు నియోజకవర్గం నుంచి జాతీయ శాసనసభ సభ్యుడిగా ఎన్నికై 1945లో మరణించే వరకూ ఆ పదవిలో కొనసాగారు.

పలు పురస్కారాలు, పదవులు

విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరో పీఠాధిపతిగా 1928లో బాధ్యతలు చేపట్టిన ఆయన మరణించేవరకూ పీఠాధిపత్యం వహించారు. సర్వమతసమభావనా కేంద్రంగా పీఠాన్ని తీర్చిదిద్దారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం సభ్యుడిగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ముస్లిం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, భారతీయ జాతీయ కాంగ్రెస్ సభ్యుడి గా పనిచేశారు. ఈయనకు 1936లో ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ అమెరికా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ప్రకటించింది. ఇంకా పలు బిరుదులు, పురస్కారాలు లభించాయి. 1945, జనవరిలో ఢిల్లీ నుంచి తిరిగి వస్తూ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వెళ్లిన ఉమర్‌ఆలీషా జనవరి 23న మరణించారు.

నేడు కాకినాడలో జయంతి సభ

కాకినాడ బోట్‌క్లబ్‌వద్ద శుక్రవారం ఉదయం కవిశేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా 140వ జయంతి సభ నిర్వహించనున్నారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్మాతిక పీఠం కాకినాడశాఖ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అంబరాన్నంటిన సంబరం

» పిఠాపురం పాదగయలో వైభవంగా నాకబలి- దండాడింపు-దొంగలదోపు ఉత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంపాదగయలో గురువారం జరిగిన నాకబలి-దండాడింపు-దొంగలదోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. పాదగయలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. నాకబలి-దండాడింపు-దొంగలదోపుఉత్సవంలో భాగంగా అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా కుంతీమాధవస్వామి దేవస్థానంవరకూ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, కింగ్‌కాంగ్ బొమ్మలు, శక్తి వేషధారుల ప్రదర్శనలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాదగయక్షేత్రం నుంచి ఉత్సవమూర్తులను తీసుకువెళ్తున్న పల్లకిని పోలీసులు మోసుకుని తీసుకువెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. పల్లకిని పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్‌ఐలు, పోలీసులు మోశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు, మునిసిపల్ కమిషనరు కనకారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆచార బ్రహ్మత్వంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



దొంగలదోపు ఉత్సవంలో రంగులు చల్లుతున్న అర్చకులు

పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి రథోత్సవం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్‌దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కుంతీ మాధవస్వామి కోనేరునుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు.



పిఠాపురం పాదగయ వద్ద శక్తి వేషధారణలో ప్రదర్శనలు

కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీబస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 50-57 ఏళ్ల మధ్య వయస్సున్న మగ వ్యక్తి మృతదేహం ఒంటిపై ఎరుపు, పచ్చ, తెలుపురంగుల గళ్ల చొక్కా, తెలుపు, నీలం రంగు లుంగీ ఉంది. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. వారికి వివరాలు తె లియరాలేదు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 94407966622, 08813-231100, 9154875583 నెంబర్లలో సమాచారం అందజేయాలని సీఐ విశ్వం తెలిపారు.

పీక కోసుకుని యువకుడి ఆత్మహత్య



సంఘటనా స్థలంలో లోవరాజు మృతదేహం

తొండంగి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేటలో గురువారం ఓ యువకుడు మనోవేదనకు గురై పదునైన కత్తితో పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన కుందేటి సత్యన్నారాయణమ్మ తన రెండో భర్తతో తమ్మయ్యపేటలో నివసిస్తోంది. ఆమె కుమారుడు కుందేటి లోవరాజు (28) జనవరి 8న భార్య నాగలక్ష్మి, రెండేళ్ల కుమారుడితో కలిసి తొండంగి మండలం తమ్మయ్యపేట వచ్చి ఉంటున్నాడు. భార్యభర్తలు గొడవపడడంతో ఫిబ్రవరి 6న భార్య పుట్టింటికి మురారి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మనోవేదనకు గురైన లోవరాజు మధ్యాహ్నం 3గంటలవేళ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు. తర్వాత ఫోను తల్లికి ఇచ్చి మేడపైకి వెళ్లాడు. అక్కడ ఉన్న సింటెక్స్ వాటర్ ట్యాంకుకు, గోడకు మధ్య కూర్చుని పదునైన వస్తువుతో పీక కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీని ఢీకొట్టిన బొలెరో

తృటిలో తప్పిన పెను ప్రమాదం



గండేపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం ప్రకారం హైదరాబాద్‌నుంచి విశాఖపట్నం ములక్కాడ లోడుతో వెళ్తున్న బొలెరో వ్యాన్ ముందు వెళ్తున్న ట్రాలీని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో అందరూ బయట పడ్డారు. ఒక్కసారిగా వ్యాన్ బోల్తా కొట్టడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన

నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కాకినాడ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక మహిళను గరికిన మహేష్ అనే యువకుడు 2022లో అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్‌ఐ నాగార్జునరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోలీసులు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అనంతరం నిందితుడు మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు రాజమహేంద్రవరం 8వ జిల్లా సెషన్స్ జడ్జి, స్పెషల్ జడ్జి ఫర్ ట్రైల్ ఆఫ్ ఆఫన్సస్ అగైనెస్ట్ ఉమెన్ కేసులు కోర్టు మెజిస్ట్రేట్ వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుళ్లు ఏవీఎస్ఎన్ మూర్తి, ఎ.వెంకటేశ్వరరావులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

4 నుంచి 'నన్నయ'లో నారీఫెస్ట్

» మొదటి రోజు మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు
» క్యాంపస్ మహిళలకు ప్రత్యేకం
» వర్సిటీ అనుబంధ కళాశాలల సిబ్బందికీ పోటీలు
» 6న ఘనంగా వేడుకలు
» ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మార్చి 4 నుంచి మూడురోజులపాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని గురువారం కోరారు.

రాజమహేంద్రవరం పరిసరాల్లో వారు అర్హులు

విశ్వవిద్యాలయంలో నారీఫెస్ట్ పోటీలు ప్రారంభమయ్యే మొదటిరోజు అనగా 4వ తేదీన మామ్మ(అమ్మమ్మ, నానమ్మ)-మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు జరుగుతాయన్నారు. మామ్మ-మనవరాలు ఫ్యాషన్ షో పోటీల్లో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని ఆడశిశువుల నుంచి వృద్ధ మహిళల వరకూ పాల్గొనవచ్చునన్నారు. ఆరోగ్యకరమైన శిశువుల ప్రదర్శనలో ఐదేళ్ల లోపు ఆడ, మగ శిశువులు పాల్గొనేందుకు అర్హులన్నారు. మామ్మ వయస్సు 60 నుంచి 80ఏళ్లు, మనవరాలు వయస్సు 5నుంచి 10ఏళ్ల మధ్య ఉండాలన్నారు. మహిళల్లో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనదలచిన వారు మార్చి 3వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను గానీ, విశ్వవిద్యాలయ ఉమెన్ సెల్‌ను గానీసంప్రదించాలన్నారు. హెల్దీబేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లకు ఫోన్‌చేస్తే పూర్తి వివరాలు తెలుపుతారన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని విద్యార్థినులకు, సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్యాంపస్ సిబ్బంది, విద్యార్థులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు.

5, 6 తేదీల్లో..

5న నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి సృజనాత్మక చేతి పనులు, చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, పూల అలంకరణ వంటి వివిధ పోటీలు విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం కుటుంబానికి చెందిన మహిళా సభ్యులు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 6న విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని వీసీ తెలిపారు. పోటీల్లో విజేతలకు నారీఫెస్ట్ కార్యక్రమంలో జ్ఞాపికలను, ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ఈ వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, మహిళలు ప్రదర్శిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలు విశ్వవిద్యాలయం మహిళా విభాగం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మహిళలందరూ ఈ కార్యక్రమాలకు హాజరై నారీఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు సెలవు దినాలుగా ప్రకటించాలి

ఏపీ ఎన్జీజీవోస్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించేందుకు 5,6 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటించాలని ఏపీఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ షాన్‌మోహన్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా క్రీడా మైదానంలో జరిగే ఈ ఆటల పోటీలను కలెక్టర్ ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా కోశాధికారి వై.పద్మ మీనాక్షి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

యానాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యానాం శివారు సావిత్రినగర్‌కు చెందిన యువకుడు పట్టా మోహన్(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యానాం సావిత్రినగర్‌లో ఉంటున్న మోహన్ చెడు అలవాట్లకు బానిసై అతడి మానసిక స్థితి పరిస్థితి బాగాలేదు. కుటుంబ వివాదాల నేపథ్యంలో తండ్రి ధర్మరావు ఏటిమొగలోను, తల్లి రమణ సావిత్రినగర్‌లోను ఉంటున్నారు. అతడు ఇంటికి వెళ్లకుండా తాను పనిచేస్తున్న బోటు వద్దే ఉంటున్నాడు. మానసికంగా సరిగా లేకపోవడంతో మోహన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రసవత్తరంగా సాగిన సెమీఫైనల్స్

» ముగింపు దశకు చేరుకున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



సెమీఫైనల్స్‌లో తలపడుతున్న ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ మహిళల జట్లు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ముగింపు దశకు చేరుకుంది. గురువారం వివిధ రాష్ట్రాల మహిళల, పురుషుల మొత్తం నాలుగు మ్యాచ్‌లు సెమీఫైనల్లలో తలపడ్డాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్‌వర్మ, జిల్లా అటవీశాఖఅధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీకోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సాసెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, హర్యానా సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఒడిస్సా సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య సెమీఫైనల్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 8-2 తేడాతో విజయం సాధించింది. ఆర్‌ఎస్బీ హైదరాబాద్, హర్యానా సెక్ర టేరియట్ పురుషులజట్ల మధ్య సెమీఫైనల్‌లో ఆర్‌ఎస్బీ హైదరాబాద్ 5-0తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులు ఎంతో నేర్చుకుంటారు



ఇటువంటి జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరుగుతూ ఉంటే వాటిని చూసి ఎంతోమంది క్రీడాకారులు ప్రేరణ పొందుతారు. సరైన సమయంలో శిక్షణ ఇస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా తయారవుతారు. నేను ఇలాంటి ప్రేరణతోనే ఇండియాజట్టు సభ్యుడిగా ఏషియన్ గేమ్స్‌లో హాకీ వరల్డ్‌కప్ ఆడగలిగాను. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి.

-ధనుంజయ్ మహాడి, అంతర్జాతీయ క్రీడాకారుడు, జీఎస్టీ, డిప్యూటీ కమిషనరు, మహారాష్ట్ర

కాకినాడలో మెరిసిన అంతర్జాతీయ క్రీడాకారులు



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి టోర్నమెంటుకి కాకినాడ వేదిక కావడంతో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు, ఆయా రాష్ట్రాల నుంచి వారి ప్రోత్సాహకులు కాకినాడ జిల్లా క్రీడా మైదానానికి తరలివస్తున్నారు. అంతర్జాతీయ టోర్నీల్లో వివిధ విభాగాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఒకేచోట కలవడంతో వారి క్రీడా విశేషాలను పంచుకున్నారు. ఇంటర్నేషనల్ హాకీ ప్లేయర్ సోనిక(ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ ఢిల్లీ), ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ చెరుకూరి పూర్ణిమ (ఇన్‌కం ట్యాక్స్ సూరింటెండెంట్ హైదరాబాద్, తెలంగాణ), ఇంటర్నేషనల్ అథ్లెట్ ఫిరోజ్ భాను (ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్, తెలంగాణ).. వీరు ముగ్గురూ హాకీ గ్రౌండ్‌లో మెరవడంతో అక్కడున్న క్రీడాకారులు వారిని ఆప్యాయంగా పలకరించి కాసేపు సరదాగా గడిపారు.

క్రీడలతోనే మంచి భవిష్యత్



1994లో స్పోర్ట్స్ కోటాలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్‌లో యూడీసీగా చేరాను. ఇప్పుడు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. ఆర్‌ఎస్‌బీ హైదరాబాద్ హాకీ టీం మేనేజరుగా కొనసాగుతున్నాను. క్రీడాకారులు ఆటపట్ల అంకితభావంతో ముందుకెళ్తే స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగంతో స్థిరపడే అవకాశముంది. క్రీడాకారులు ఇటువంటి టోర్నీల ద్వారా ప్రేరణ పొంది చక్క గా రాణించాలి.

-పి.వెంకటేశులు, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్, ఆర్‌ఎస్‌బీ హైదరాబాద్ టీం మేనేజరు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



హూపర్స్ క్లబ్, కేరళ జట్లు తలపడుతున్న దృశ్యం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు రెండోరోజుకు చేరుకున్నాయి. టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఈ టోర్నీని ఇటీవల మరణించిన క్రీడాకారుడు, అంతర్జాతీయ షటిల్ ఆటగాడు సాత్విక్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథానికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. గురువారం మొదటి మ్యాచ్ హూపర్స్ క్లబ్(ముంబై), కేరళ స్ట్రైకర్స్ మధ్య జరిగింది. నువ్వా.. నేనా అన్నట్టు జరిగిన మ్యాచ్‌లో బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో 3-2 తేడాతో హూపర్స్ క్లబ్ విజేతగా నిలిచింది. అనంతరం ఐటీ(చెన్నై), జీఎస్టీ(ముంబై) జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. అంతర్జాతీయ రిఫరీ ఎం.డానియేలు, జాతీయ రిఫరీలు నాగేశ్వరరావు, శివగిరి, ఎల్.జార్జి, ఆర్.సురేష్ సారథ్యంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో టోర్నీ కార్యవర్గం, వలంటీర్లు వీక్షకులకు అవసరమైన వసతి కల్పిస్తున్నారు. అధికసంఖ్యలో మహిళలుపోటీలను వీక్షించేందుకు తరలివచ్చారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రాంబాబు తెలిపారు. రెల్లుగడ్డ, గుండెపూడి, తూర్పులంక ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ బి.వెంకటేశ్వరరావు చెప్పారు.



అవార్డులు అందుకుంటున్న అంబాజీపేట శాస్త్రవేత్తలు, పరిశోధనా కేంద్రం అధిపతి చలపతిరావు

జీవ నియంత్రణలపై పరిశోధనలకు...

ఉద్యానవన శాస్త్రవేత్తలకు టీమ్ అవార్డు

అంబాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన అంబాజీపేట పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలకు డాక్టర్ చాందీష్ ఆర్ బలాల్ టీమ్ అవార్డ్ ఫర్ అవుట్‌స్టాండింగ్ ఎక్స్‌టెన్షన్ వర్క్ ఇన్ బయోకంట్రోల్ టీమ్ అవార్డు లభించింది. బెంగళూరులో గురువారం జరిగిన రెండో అంతర్జాతీయ జీవ నియంత్రణ సదస్సులో ఈ అవార్డును ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చర్ ఇన్సెక్టరీ సోర్సెస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్ సుశీల్ నుంచి పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ పి.సునీత, డాక్టర్ బి.నీరజ, డాక్టర్ ఎ.కిరీటి, డాక్టర్ వి.అనూష అందుకున్నారు. కొబ్బరి, కోకోలో జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల యజమాన్యంపై పెరిగిన పరిశోధనలు, ఎక్కువ సంఖ్యలో జీవ నియంత్రకాలను ఉత్పత్తి చేసి, రైతులకు అందించినందుకు ఈ టీమ్ అవార్డు ప్రదానం చేశారు. శాస్త్రవేత్తలకు రైతు సంఘ నాయకులు, పరిశోధనా కేంద్రం సిబ్బంది అభినందనలు తెలిపారు.

చలపతిరావుకు అవార్డు

కొబ్బరిలో రూగోస్ (తెల్లదోమ)ను నియంత్రించే మిత్ర పురుగు ఎపర్టోక్రైసా ఆస్టర్‌పై చేసిన పరిశోధనా ఫలితాలను ప్రజెంట్ చేసినందుకు అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అవార్డు అందుకున్నారు. బెంగళూరులో జరిగిన రెండో అంతర్జాతీయ సదస్సులో ఎక్స్‌టెన్షన్ ఎంటమాలజిస్టు, ఒరిగాన్ స్టేట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్ర దారా ఆయనకు అవార్డు అందజేశారు.


బాలయోగీశ్వరులును దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా బాలయోగీశ్వరుల తీర్థం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తీర్థం గురువారం వైభవోపేతంగా జరిగింది. పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరులకు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపించారు. మండపంపై ఉన్న పాలరాతివిగ్రహాలు, సమాధులను ఉదయం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన చేశారు. భక్తులకు మంచినీటితో పాటు ఇతర వసతులను ఆశ్రమ కమిటీ కల్పించింది. నగర పంచాయతీ పారిశుధ్య నిర్వహణ చేపట్టింది. బాలయోగీశ్వరులను దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, ములపర్తి బాలకృష్ణ, నరిపెల్ల రామకృష్ణంరాజు, డాక్టర్ యు.రామారావు, చిక్కం శ్రీను, సీహెచ్ వెంకటరమణ తదితరులు బాలయోగీశ్వరులను దర్శించుకున్నారు.


శరణ్యను అభినందిస్తున్న పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధరం

దీన్‌దయాళ్ ఉపకార వేతనానికి శరణ్య ఎంపిక

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు జాతీయ స్థాయిలో దీన్‌దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించారు. అమలాపురం శ్రీవాగ్దేవిస్కూలు 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ శ్రీవల్లీ శరణ్య ఉత్తీర్ణత సాధించి రూ.6వేల ఉపకార వేతనానికి ఎంపికైనట్టు పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలో శరణ్యకు పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతాను అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం గురువారం అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.10వేలు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామానికి చెందిన సానం శ్రీనివాసరావు మృతి చెందాడు. అతని కుమారుడు రేవంత్ నాగషణ్ముఖ్ స్థానిక నారాయణ స్కూలులో 5వ తరగతి చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో తల్లి అనంతకుమారి సేవ్ ద పీపుల్ ట్రస్టును ఆశ్రయించింది. విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ రూ.10వేలు ఆర్థిక సాయం చెక్కును ట్రస్టు తరఫున అందజేయగా కలెక్టరేట్‌లో విద్యార్థి షణ్ముఖకు జేసీ టి.నిషాంతి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి సుంకర సుధీర్, మానస, సుప్రియ, రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

వాస్తు, హోమియో నిపుణుడు గోవిందరాజులు మృతి

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సన్నవిల్లికి చెందిన ప్రముఖ వాస్తు, హోమియో నిపుణుడు గనిశెట్టి గోవిందరాజులు (83) గురువారం మృతి చెందారు. అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమళ్ళ కాశీఅన్నపూర్ణ తండ్రి అయిన గోవిందరాజులు ఆంధ్రప్రదేశ్ అక్కౌంట్స్ జనరల్ ఆఫీసులో ఉద్యోగం చేశారు. దీర్ఘకాలంగా ఎంతో మందికి వాస్తు సలహాలతో పాటు ఉచిత హోమియో సేవలందించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. గోవిందరాజులు మృతికి సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి విచారం వ్యక్తం చేశారు.


గోవిందరాజులు (పాత చిత్రం)

మహిళ మెడలో

బంగారు గొలుసు అపహరణ

అంబాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగలకుర్రు అగ్రహారానికి చెందిన అరిగెల పద్మావతి శివరాత్రి సందర్భంగా గురువారం సమీపంలోని శివాలయానికి వెళ్లింది. ఏడు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై తలకు క్యాప్ పెట్టుకుని వచ్చి మహిళ మెడలో ఉన్న గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమె కేకలు వేయగా స్థానికులు, కుటుంబ సభ్యులు వచ్చి ఆ ప్రాంతంలో వెతికారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనాస్థలాన్ని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వి.సత్యనారాయణ తెలిపారు.

రైతు విజ్ఞాన యాత్ర

యానాం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యానాం వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో రైతు విజ్ఞాన యాత్రను పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. బెంగళూరులోని నేషనల్ హార్టికల్చర్ ఫెయిర్‌కు ఆరుగురు వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు 26 మంది రైతులు వెళ్లారు.




అమలాపురం, మలికిపురం, ముమ్మిడివరంల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్ర ఓటర్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లో మొత్తం పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అమలాపురం తహసీల్దారు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు పలివెల అశోక్‌ప్రసాద్ ఉన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి పరిశీలించారు. పీవో రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజును పోలింగ్ సరళిపై ప్రశ్నించారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరాలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. పోలింగ్ సరళిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, నాయకులు అధికారి జయవెంకటలక్ష్మి, మంథా ఫణికుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్సులను వెత్సావారి అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రాత్రికి చేర్చారు. అక్కడి నుంచి ఏలూరు తరలించాల్సి ఉంది.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో 75.47శాతం పోలింగ్ జరిగింది. మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,161 మంది ఓటర్లకు 1,631 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దారు ఎంవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థి కొల్లు గౌతమ్‌బాబు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు-మాలతి దంపతులు అల్లవరంలో ఓటు వేశారు. దివ్యాంగ ఓటర్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోడూరి మన్యం, వీఆర్వోలు సహకరించారు.

ఉప్పలగుప్తం (ఆంధ్రజ్యోతి): మండలంలో 75.5 శాతం పోలింగ్ జరిగిందని తహసీల్దారు వాసా దివాకర్ తెలిపారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు 244 పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. వానపల్లిపాలేనికి చెందిన నల్లా విజయలక్ష్మి నెలల చంటి బిడ్డతో తల్లి సహాయంతో ఓటు వేయడానికి వచ్చింది. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, టౌన్ సీఐ వీరబాబు, ఎస్ఐ సీహెచ్ రాజేష్ పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): మండలంలో 72.45 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి లైన్లో వున్న పలువురిని లోపలికి పిలిచి ఓటు వేయించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పోలింగ్ కేంద్రాల బయట ఉన్న కార్యకర్తలను ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలను అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పరిశీలించారు. ముమ్మిడివరం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎంవీ సుబ్బలక్ష్మి ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): మండలంలో 73శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దారు పి.సునీల్‌కుమార్ తెలిపారు. 1,908 ఓట్లకు 1,373 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆయన వివరించారు.

ఐ.పోలవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో 2,508 ఓట్లకు నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. 2,084 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దారు చిక్కాల విజయశ్రీ తెలిపారు. 83శాతం పోలింగ్ నమోదైంది.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో 76.68 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు పి.శ్రీపల్లవి తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్లోని 206, 207 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటలు దాటినప్పటికీ పట్టభద్రులు లైనులో వున్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు పరిశీలించగా ఎస్ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,432 మందికి 1,822 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు జె.వెంకటేశ్వరి పరిశీలించారు. ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు పోలింగ్ సరళిని పరిశీలించారు.

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): మండలంలో 71.25 శాతం పోలింగ్ నమోదైంది. మామిడికుదురు హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని అమలాపురం ఆర్డీవో కె.మాధవి పరిశీలించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. ఇక్కడ ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఓటేశారు. ఎంపీడీవో కార్యాలయ పోలింగ్ కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాలను పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్ సందర్శించి స్థానిక నాయకులను పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తహసీల్దారు సుబ్రహ్మణ్యాచార్యులు, నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అయినవిల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,514 మంది ఓటర్లకు 1,792 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహసీల్దారు సీహెచ్ నాగలక్ష్మమ్మ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రాజోలు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మండలంలో 3,390 ఓట్లకు 2,387 ఓట్లు పోలవ్వగా 710.41 శాతం నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో 69.76 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు భాస్కర్, ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ తెలిపారు. సఖినేటిపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద కూటమి నాయకులతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పోలింగ్ సరళిపై ఆరా తీశారు. కార్యక్రమంలోగుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, కడలి వెంకటరత్నం, రావూరి నాగు, పొన్నాల ప్రభ, తాడి మోహన్‌కుమార్, ఆకన బాబ్జీనాయుడు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, బర్రె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో 70.62 పోలింగ్ నమోదైంది. విధుల్లో ఉన్న మహిళా కండక్టర్ సెంటర్‌లో బస్సు నిలిపి ఓటు హక్కు వినియోగించుకుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతీ, యువకులు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చారు.పూర్వమే పట్టభద్రులైన వయోవృద్ధులు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మలికిపురం ఎస్ఐ పీవీవీ సురేష్ భద్రతను పర్యవేక్షించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, మహిళానాయకురాళ్లు మంగెన భూదేవి, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, యెనుములనాగు, చెల్లించి సత్యనారాయణ, జంపన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.


ఉప్పలగుప్తంలో ఓటు వేసేందుకు నెలల బిడ్డతో వచ్చిన నల్లా విజయలక్ష్మి


ముమ్మిడివరంలో చిన్నారులను తీసుకుని ఓటు వేసేందుకు వచ్చిన భార్యాభర్తలు


బిడ్డతో వచ్చి అమలాపురం తహసీల్దారు కార్యాలయంలో ఓటేసిన రాధ


పి.గన్నవరంలో ఓటేసిన దివ్యాంగుడు


అమలాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు కుటుంబసభ్యులు


అల్లవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు దంపతులు


పి.గన్నవరంలో ఓటేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు


రాజోలులో మండల రిసోర్సు కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఓటర్లు


అయినవిల్లిలో...


అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో...


సఖినేటిపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న పట్టభద్రులు


హైస్కూలు గ్రౌండులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఎమ్మెల్యే ఓట్ల అభ్యర్థనపై సోషల్ మీడియాలో ప్రచారం

పి.గన్నవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి పేరాబత్తుల రాజశేఖరం అని, పట్టభద్రుల సమస్యలపై ఆయన శాసనమండలిలో ప్రశ్నిస్తారని చెప్తూ.... పి.గన్నవరంలోని హైస్కూల్ పోలింగ్ కేంద్రం సమీపంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు ప్రచారం నిర్వహించారు. కొంతమంది సంబంధిత వీడియో క్లిప్పింగ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని జోరుగా ప్రచారం చేశారు.

అంబేడ్కర్ చిత్రపటం ఆవిష్కరణ

రాజోలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువ న్యాయవాదులు ముందడుగు వేయాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి కోరారు. రాజోలు సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు గురువారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయిబాబు, ప్రధాన కార్యదర్శి జి.స్టాలిన్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, ఆకుల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు

సహచర విద్యార్థులకు ఆర్థిక సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లా పరిషత్ హైస్కూలు 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమతో చదువుకుని ఇబ్బంది పడుతున్నా నాలుగు కుటుంబాల వారికి గురువారం ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులు ఒక వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి అందరూ సమకూర్చిన రూ.1.50 లక్షలను పాశర్లపూడిలంక, నగరం గ్రామాలకు చెందిన వారికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేగి లక్ష్మీనారాయణ, అల్లూరి సత్యకిశోర్‌వర్మ, తాడి దళీలా, పాలూరి రాంబాబు, ఈలి మురళీకృష్ణ, మెండా ఆదినారాయణ, చవ్వాకుల విద్యాసాగర్, నయినాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సహచరుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మండపేట



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.43 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,43,314 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో లింగోద్భవ పూజలు

రాయవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి శైవక్షేత్రాల్లో లింగోద్భవ పూజలు జరిపారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి లింగోద్భవ కాలంలో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. మండలంలోని అష్టసోమేశ్వర ఆలయాల్లో రెండుగా ఉన్న సోమేశ్వరం బాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు లింగోద్భవ పూజలు చేశారు.



వెదురుపాక విజయదుర్గా పీఠంలో లింగోద్భవ పూజలు చేస్తున్న దృశ్యం

స్వచ్ఛ మండపేట లక్ష్యంగా కృషి చేద్దాం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) స్వచ్ఛ మండపేట లక్ష్యంగా పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పిలుపునిచ్చారు. మండపేటలో గురువారం ఆయన 12వ వార్డు ఆనంద్ నగర్, పాటిమీద, బోళ్లవారి వీధుల్లో సచివాలయ, మెప్మా సిబ్బందితో కలిసి ఆయన పర్య టించారు. మహిళలకు తడిపొడి చెత్త వేరు చేయటంతోపాటు పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది ఇళ్లకు వచ్చినపుడు చెత్తను అందించి సహక రించాలని ఆయన కోరారు. పట్టణంలో ఆరోగ్య సర్వే జరుగుతోందని ప్రజలు వారికి సహ కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఏఈలు అంజనేయులు, పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం సుజాత, ఆర్‌పీ లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉమా కొప్పేశ్వరస్వామి చక్రస్నానం

1కొత్తపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి చక్రస్నానాన్ని అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి చక్రస్నానాన్ని తిలకించేందుకు వందల సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. స్వామివారి చక్రస్నానానికి పండితులు ఊరేగింపుగా తీసుకువచ్చి కాలువ ప్రాంగణంలో ముందుగా ప్రత్యేక పూజలు చేసి చక్రస్నానం జరిపారు.



పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శంకరరావు

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని రామచంద్రపురం 13వ జిల్లా అదనపు, సెషన్స్ జడ్జి శంకరరావు అన్నారు. గురువారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం జరిపారు. గతంలో జరిగిన లోక్ అదాలత్‌లో రామచంద్రపురం నుంచి అధిక సంఖ్యలో కేసులు ఇచ్చి న్యాయవాదులు సహకరించారని వచ్చే లోక్ అదాలత్‌లో కూడా కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు జరిగి మూడు నెలలు పూర్తయ్యిందని, సివిల్, క్రిమినల్, అప్పీలు కేసుల విచారణ జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృధ్వీరాజ్, మహిళా న్యాయవాదుల ప్రతినిధి సత్యవాణి కేవీ సత్యవాణి, సీనియర్ న్యాయవాదులు అల్లం గనిరాజు, ముషిని సర్వారాయుడు, వి.గోపాలరావు, మల్లిడి హరినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలయోగీశ్వరులును దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా బాలయోగీశ్వరుల తీర్థం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తీర్థం గురువారం వైభవోపేతంగా జరిగింది. పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరులకు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపించారు. మండపంపై ఉన్న పాలరాతివిగ్రహాలు, సమాధులను ఉదయం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన చేశారు. భక్తులకు మంచినీటితో పాటు ఇతర వసతులను ఆశ్రమ కమిటీ కల్పించింది. నగర పంచాయతీ పారిశుధ్య నిర్వహణ చేపట్టింది. బాలయోగీశ్వరులను దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, ములపర్తి బాలకృష్ణ, సరిపెల్ల రామకృష్ణంరాజు, డాక్టర్ యు.రామారావు, చిక్కం శ్రీను, సీహెచ్ వెంకటరమణ తదితరులు బాలయోగీశ్వరులను దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేటి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. మెయిన్‌రోడ్డు, మోడరన్ కళాశాల, రత్నంపేట తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.



ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న తహశీల్దారు



కె.గంగవరంలో పోలింగ్ బూత్ వద్ద బారులుతీరిన ఓటర్లు



రాయవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

• ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి సుభాష్, ఎంపీ బోస్ • పోలీసు బందోబస్తు మధ్య ముగిసిన ఘట్టం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల భవనం పోలింగ్ కేంద్రం, మండల పరిషత్, మండల మహిళా సమాఖ్య, పాత తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు: కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఆర్బోస్ శీతల పానీయాల తయారీ సంస్థ అధినేత అడ్డూరి జగన్నాధవర్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలంలో 1601 ఓట్లకుగాను 1244 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 180 పోలింగ్ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 181, 182 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాల వద్ద అవాంఛనీయ



మండపేట-ఏడిద రోడ్డులోనున్న హైస్కూల్లో బారులుతీరిన గ్రాడ్యుయేట్ ఓటర్లు

సంఘటనలు జరగకుండా రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ రాము బందోబస్తు నిర్వహించారు. తహశీల్దారు పి.రాజేశ్వరరావు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

పోలింగ్ సరళిని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం ఆత్రేయపురంలో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలుసుకున్నారు.



కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు



రావులపాలెంలో ఓటు వేస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు సతీష్‌రాజు

కూటమి శ్రేణులతో ఆయన పోలింగ్ సరళిపై చర్చించారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గణేష్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం తదితరులు ఉన్నారు.

72.09 పోలింగ్ శాతం

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా, 1,467 మంది ఓట్లు వేశారు. మొత్తంగా 72.09 పోలింగ్ నమోదైంది. ఎన్నికల అధికారి కె.గంగవరం తహశీల్దార్ వీటిని పర్యవేక్షించారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఒకటి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలు జరిపారు. 77.10 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల నిర్వహణాధికారి, తహశీల్దార్ చిన్నారావు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో మండపేట రూరల్ సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 8 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటింగ్‌లో 79.29 శాతం నమోదైందని అధికారులు తెలిపారు. గురువారం జరిగిన ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, వృద్ధులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ సందర్శించారు. ఆయన వెంట పట్టణ సీఐ సురేష్, రూరల్ సీఐ దొర్రాజు, పట్టణ, రూరల్ ఎస్ఐలు శాస్త్రి, బుజ్జిబాబు సిబ్బందితో పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని పర్యవేక్షించారు.

ఓటుహక్కును వినియోగించుకున్న నేతలు: గురువారం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చండ్రు శ్రీవరప్రకాష్ మండపేట ఏడిద రోడ్డులో వున్న పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటింగ్ సరళిని పరిశీలించిన పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు, ఎమ్మెల్యే వేగుళ్ల



రాయవరంలో ఓటు వేస్తున్న యువతి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులు ఆరా తీశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పలుచోట్ల పర్యటించి కూటమి నేతలతో పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

మండలంలో 74.02 శాతం పోలింగ్

రాయవరం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా సాగింది. రాయవరం మండల ప్రజా పరిషత్, తహశీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలు జరుగుతున్న తీరును రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల పరిశీలించారు. మండలంలోని 12 గ్రామాల్లో 1,863 మంది ఓటర్లు ఉండగా 1,379 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా 74.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దారు ఐపీ శెట్టి తెలిపారు. రాయవరం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పోలింగ్ తీరుపై స్థానిక నాయకులను ఆరా తీశారు.



ఆత్రేయపురంలో ఓటు వేసి బయటకు వస్తున్న ఒక కుటుంబం

డివిజన్‌లో 73.60 శాతం నమోదు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. మండలానికి సంబంధించి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉండగా, 72.42 శాతం నమోదైనట్లు ఆర్డీవో తెలిపారు. కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మండలంలో 3,700 మంది ఓటర్లు ఉండగా 2,578 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు, రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆత్రేయపురంలో ఓటు వేసి వస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు



ప్రత్యేక అలంకరణలో ఏడిద సంఘమేశ్వరస్వామి

సంఘమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మండపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) మండపేట మండలం ఏడిదలో వున్న సంగమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుదవారం అర్ధరాత్రి స్వామివారికి లింగోద్భవ పూజలు చేశారు. గురువారం స్వామివారికి నిత్యాగ్నిహోత్రం, బలిహరణ పూజలు చేశారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సత్యనారాయణ, శర్మల సారధ్యంలో వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన సప్తాహం

కె.గంగవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో ఉన్న లోపాముద్రాదేవి సమేత అగస్తేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న సప్తాహం కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ముగింపును పురస్కరించుకుని శాంతి కల్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పామర్రులో సాగునీటి కష్టాలు

• బీటలువారుతున్న పొలాలు • ఆందోళనలో రైతులు

కె.గంగవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రబీ పంటలో సాగునీటి కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. ఆదిలో కొంత ఇబ్బంది లేకున్నా ప్రస్తుతం నీటి ఎద్దడి రైతు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇరిగేషన్‌శాఖ అమలు చేస్తున్నా వంతులవారీ విధానంలో నీరు తక్కువగా వస్తుండటంతో దానికోసం రాత్రిళ్ల కాపు కాయవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. వచ్చిన కొద్దిపాటి నీరు పొలంలో పారితే ఎండల తీవ్రతకు ఆవిరైపోతున్నదని రైతులు వాపోతున్నారు. మండలంలోని పామర్రు గ్రామంలో రావిదొడ్డికి చెందిన సుమారు 70 ఎకరాల్లో పంట పొలాలు నీరు లేక బీటలువారాయి. ఇప్పటికే ఎకరాకు సుమారు 20 వేల వరకు పెట్టుబడులు పెట్టామని ఇప్పుడు నీరు లేకపోవడంతో పంటలు పాడైపోతాయని రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన పొట్లకాయ సత్యనారాయణ, తాడి సత్తిబాబులు చెరో రెండు ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నా రు. ప్రస్తుతం వరి ఈనిక దశకు చేరుకుంది. ఈ దశలో నీరు అవసరం ఎక్కువ ఉన్నా వంతు వచ్చిన సమయంలో నీరందడం లేదని వాపోతున్నారు. కేవలం ఒకరాత్రి మాత్రమే రావిదొడ్డికి నీరు ఇస్తున్నా ఇది సరిపోక పొలం బీటలువారుతోందని ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజులు నీరు లేకుండా ఉంటే పంట పూర్తిగా పాడైపోతుందని వారు వాపోతున్నారు. రెండు రోజులు ప్రత్యేకంగా వంతు ఇచ్చి తమ పొలాలకు తగిన నీరు అందించి పంటలను రక్షించాలని వారు కోరుతున్నారు.



పామర్రులో బీటలుబారిన వరిచేలు

నత్తనడకన రోడ్డు మరమ్మతులు

మండపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతినాటికల్లా రోడ్డుపై గోతులుంటే ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలే బాధ్యులు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినా అమలులో కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పలు రహదారులకు మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ద్వారపూడి గ్రామంలో కెనాల్ రోడ్డును ఆనుకుని వున్న రైల్వే ఫ్లైఓవర్ వంతెనకు ఇరువైపులా బిడ్జి పైనా క్రింద కెనాల్ రోడ్డులో మరమ్మతులు చేశారు. అయితే వంతెన నుంచి ద్వారపూడి రాజానగరం వెళ్లే రోడ్డు మాత్రం మరమ్మతులు చేయలేదు. దీంతో ఎక్కడ గోతులు అక్కడే వున్నాయి. ప్రతిరోజూ ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్వారపూడి వైపు రోడ్డు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద తక్షణమే గోతులకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.





అనపర్తి వైపు మరమ్మతులు చేస్తున్న దృశ్యం. ద్వారపూడి గ్రామంలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద గోతులుగా మారిన రోడ్డు

రామచంద్రపురంలో చికెన్ మేళా

ద్రాక్షారామ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో గురువారం ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో చికెన్ మేళా నిర్వహించారు. రామచంద్రపురం చికెన్ వ్యాపారుల సంఘం, వెంకటేశ్వర హేచరీస్ కాకినాడ బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చికెన్ మేళాలో 100 కిలోల చికెన్‌తో చేసిన పకోడి, 100 కిలోల చిల్లీ చికెన్, 2వేల కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ అమలదారు గనిరాజు, ఉదయ్, జుత్తుక సత్యనారాయణ, బిజిలి, సుబ్బు, శ్రీను, కంపెనీ ట్రేడర్ వంగా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు చికెన్ మేళా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో స్థానికులు చికెన్ వంటకాలు ఆరగించారు.

గంగవరంలో నేత్రదానం

కె.గంగవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం గ్రామానికి చెందిన చింతా చిన్నారి గురువారం మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు రాజేంద్రకుమార్, చంద్రశేఖర్, రామకృష్ణ, నాని, దొరబాబులు అంగీకారంతో నేత్రదానం చేశారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు ప్రతినిధులు చిన్నారి నేత్రాలను సేకరించారు. గత సంవత్సరం చిన్నారి భర్త చింతా రవీంద్రనాధ్ మరణిస్తే అప్పుడు కూడా వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. నేత్రదానం చేసినందుకు గ్రామస్తులు వారిని అభినందించారు.

పాపారావు మృతికి సంతాపం

మండపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మాల మహాసభ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పాదూరి పాపారావు గురువారం న్యూ కాలనీలో ఇంటి వద్ద మృతి చెందారు. మండపేటకు చెందిన అయన మాలల అభ్యున్నతికి విశేషంగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో దళిత నేతగా అయన గుర్తింపు పొందారు. మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ప్రముఖ శిష్యుడిగా ఆయన వున్నారు. పాపారావు అంత్య క్రియలను పలువురు అభిమానుల మధ్య గురువారం నిర్వహించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.